

కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న దళితబంధు లబ్ధిదారులు



దళితబంధు మహిళా లబ్ధిదారులను బలవంతంగా వ్యాన్‌లోకి ఎక్కిస్తున్న పోలీసులు

# దళితబంధు లబ్ధిదారులపై పోలీసు జులుం

- ప్రజావాణికి వెళ్తున్న వారిని ఈడ్చేసి అరెస్టు
- బలవంతంగా వాహనాల్లోకి విసిరేసి పీటీసీకి తరలింపు
- కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట లబ్ధిదారుల మెరుపు ధర్నా

కలెక్టరేట్, ఫిబ్రవరి 26: పాలకులం కాదని.. ప్రజా సేవకులమని.. సామాన్యులు సమస్యల పరిష్కారానికి ఆందోళనలు చేయవచ్చని గొప్పలు చెప్పిన రేవంత్ సర్కారు ఆచరణలో మాత్రం నియంతృత్వాన్ని ప్రదర్శిస్తున్నది. నిన్న హనుమకొండ జిల్లా అగ్రహంపహాడ్ సమ్మక్క జాతరలో 'జై తెలంగాణ' అని నినదించిన పాపానికి యువకులపై లాఠీలు ఝుళిపించిన ఖాకీలు.. తాజాగా దళితబంధు రెండో విడత నిధులపై ఫ్రీజింగ్ ఎత్తివేయాలని సోమవారం కరీంనగర్ ప్రజావాణిలో విన్నవించేందుకు హుజూరాబాద్ నుంచి వచ్చిన 500 మంది లబ్ధిదారులపై దాష్టీకాన్ని ప్రదర్శించారు. ఎక్కడివారినక్కడే అడ్డగించి బలవంతంగా పోలీసు వ్యాన్లు, జీపుల్లోకి నెట్టి, పోలీసు శిక్షణ కళాశాలకు తరలించారు. అర్జీలను గుంజుకున్నారు. మహిళలు అని కూడా చూడకుండా ఈడ్చుకెళ్లి, వ్యాన్లలోకి ఎత్తిపడేశారు. పోలీసుల దమనకాండను నిరసిస్తూ పలువురు దళిత యువకులు కలెక్టరేట్ రోడ్డుపై మెరుపు ధర్నాకు దిగారు. సీఎం రేవంత్ డౌన్.. డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో వన్‌టౌన్ సీఐ సరిలాల్, పలువురు ఎస్సైలు, డిస్ట్రిక్ట్ గార్డులు యువకులను బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. దళితబంధు రెండో విడత నిధుల నిలిపివేతపై కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్తుంటే దుర్మార్గంగా వ్యవహరించడమేంటని ఆందోళనకారులు నిలదీశారు. మహిళలు శాపనార్థాలు పెట్టారు. ఆందోళన విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున కార్యాలయానికి వచ్చి సమస్యలు చెప్పుకోవాలని సూచించారు. దీంతో పదుల సంఖ్యలో ఆందోళనకారులు ఆయనపై విరుచుకుపడ్డారు. సమస్య జఠిలమవడానికి నువ్వే కారణమంటూ నిలదీశారు. దీంతో ఆయన ప్రజావాణికి తిరిగి వెళ్లిపోయారు. 10 రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని చెప్పిన సంబంధిత అధికారి నెల గడిచినా విచారణ పూర్తి చేయలేదని లబ్ధిదారులు ఆరోపించారు. కరీంగనర్ జడ్పీ చైర్‌పర్సన్ కలెక్టరేట్ వద్దకు చేరుకొని లబ్ధిదారులకు సంఘీభావంగా నిరసనలో పాల్గొన్నారు.

## నల్ల చొక్కాతో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిరసన



హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి 26: సోమవారం దళితుల అరెస్టును ఖండిస్తూ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇక్కడ నల్ల చొక్కా ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితబంధు రెండో విడత నిధులు విడుదల చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేసేందుకు వెళ్లిన దళితులను అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని అన్నారు. 2,800 మంది లబ్ధిదారులకు రూ.ఐదు లక్షల చొప్పున దళితబంధు నిధులను విడుదల చేయాల్సి ఉందని చెప్పారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దళితబంధు లబ్ధిదారుల అకౌంట్లలో రూ.10 లక్షలు జమ చేశారని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్రీజ్ చేసిందని ఆరోపించారు. కరీంనగర్ జిల్లాలో పెద్ద మంత్రిని అని చెప్పుకునే వ్యక్తి దళితులను అరెస్టు ఎందుకు చేయించారని, ప్రజాపాలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు. వెంటనే నిధులు ఇవ్వకపోతే ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

### చెప్పకునేందుకు వత్తే పట్టుకొని తన్నిన్రు

దళితబంధు రెండో విడుత పైసలు ఇయ్యాలని కలెక్టర్‌కు చెప్పుకునేందుకు వచ్చిన మమ్మల్ని పోలీసులు పట్టుకొని తన్నిన్రు. పోయిన నెలలో కలెక్టర్‌కు మా గోడు చెప్పుకుంటే 15 రోజుల్లో పరిష్కరిస్తా అని చెప్పింది. ప్రభుత్వం పట్టించుకోకుంటే ఇంకా ఎక్కువ లొల్లి చేస్తం.

**- రామంచ వరలక్ష్మి, కనగర్తి, జమ్మికుంట మండలం, కరీంనగర్ జిల్లా**

### కేసీఆర్ సర్కారే మంచిగుండె..

కూలీనాలీ చేసుకొని బతికే మమ్ములను లక్షాధికారులను చేసేందుకు కేసీఆర్ సార్ దళితబంధు పథకం పైసలు మొదటి విడత ఐదు లక్షలు ఇచ్చిండు. మిగిలిన పైసలు ఖాతాల్లో వేసిండు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓర్వలేక నిధులను నిలిపివేసింది. కేసీఆర్ ప్రభుత్వమే మంచిగుండె.

**- సమ్మక్క, ఇల్లందకుంట మండలకేంద్రం, కరీంనగర్ జిల్లా**

# కష్టాల సుడిగుండంలో 'సెస్'

- ట్రాన్స్‌కోలో విలీన ప్రతిపాదన
- అదే జరిగితే కష్టాలు తప్పవంటున్న వినియోగదారులు
- సెస్‌ను నిలబెట్టుకుందామని పిలుపు



సిరిసిల్ల సహకార విద్యుత్తు సరఫరా సంస్థ

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ సహకార రంగానికే స్ఫూర్తిగా నిలిచిన సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ(సెస్) ఇప్పుడు కష్టాలు సుడిలో చిక్కుకుని విలవిల్లాడుతున్నది. ఐదున్నర దశాబ్దాల చరిత్ర కలిగిన 'సెస్'ను బకాయిల భారం వెంటాడుతున్నది. హెచ్‌టీ లైన్లు వేసి, వాటిని ఎల్‌టీ లైన్‌లో నమోదు చేసి అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన సెస్‌ను ట్రాన్స్‌కోలో విలీనం చేయాలంటూ విద్యుత్ నియంత్రణ మండలి నివేదిక ఇవ్వడంపై నిరసన వ్యక్తమవుతున్నది. సెస్‌లో ప్రస్తుతం 2.90 లక్షల మంది వినియోగదారులున్నారు. 2.84 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా, అందులో వ్యవసాయ కనెక్షన్లు 79,570, మరమగ్గాలకు 8,265, గృహ విద్యుత్‌కు 1,65,928, వివిధ పరిశ్రమలకు 1,657, వాణిజ్య వ్యాపారాకు 14,138, ఇతర కనెక్షన్లు 19,678 ఉన్నాయి.

### లో వోల్టేజీ సమస్యకు చెక్

లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్న రైతుల కష్టాలు తీర్చేందుకు రూ. 70 కోట్లతో 220 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసింది. రూ.260.50 కోట్లతో 33/11కేవీ సబ్‌స్టేషన్లను రెండు గ్రామాలకోటి చొప్పున ఏర్పాటు చేసింది. సెస్ నష్టాల్లో కూరుకుపోవడానికి బకాయిలు వసూలు కాకపోవడమే కారణం. ప్రభుత్వం నుంచి సెస్‌కు రూ.624.92 కోట్ల బకాయిలు రావాల్సి ఉండగా, ప్రైవేటు బకాయిలు కూడా కలుపుకొంటే ఆ మొత్తం రూ.714.57 కోట్లకు చేరింది. ఎన్‌పీడీసీఎల్‌కు రూ.558.44 కోట్ల అప్పు చెల్లించాల్సి ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని నష్టాల్లో కూరుకుపోయిందని పేర్కొంటూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్‌ఈఆర్‌సీ) సెస్‌ను ఎన్‌పీడీసీఎల్‌లో విలీనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసినప్పటికీ ప్రభుత్వ బకాయిలు రూ. 624.92 కోట్ల బకాయిలను మాత్రం ప్రస్తావించకపోవడం గమనార్హం.

### సహకార స్ఫూర్తికే విరుద్ధం



సెస్‌ను విలీనం చేయాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలి. వినియోగదారుల భాగస్వామ్యంతో నడుస్తున్న సహకార విద్యుత్తు సంస్థను విలీనం చేయడమనేది సహకార రంగ స్ఫూర్తికి విరుద్ధం. బోర్డులో కలిపితే వినియోగదారులకు ఇబ్బందులుంటాయి. ఎల్‌టీ, హెచ్‌టీ లైన్ల విషయంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలి. బకాయిలు వసూలు చేయాలే తప్ప విలీనం చేయడం సరికాదు.

**- ఆడెపు రవీందర్, సిరిసిల్ల మున్సిపల్ మాజీ చైర్మన్, బీజేపీ పార్లమెంటరీ జాయింట్ కన్వీనర్**

### విలీనాన్ని అడ్డుకుంటాం




వినియోగదారుల వాటా ధనంతో 50 ఏండ్లకు పైగా సెస్ మెరుగైన సేవలందిస్తున్నది. కొందరు పాలకులు చేసిన తప్పిదం వల్ల చెడ్డ పేరు వస్తే అందుకు చర్యలు తీసుకోవాలి. బోర్డులో విలీనం చేస్తే వినియోగదారులకు తీవ్ర నష్టం జరుగుతుంది. సెస్ పరిధిలో ఎక్కువ శాతం వ్యవసాయం, మరమగ్గాల పరిశ్రమలున్నాయి. ప్రస్తుతం గృహ, పరిశ్రమలకు మెరుగైన సేవలందుతున్నాయి. వినియోగదారులందరం కలిసి విలీనాన్ని అడ్డుకుంటాం.

**- పంతం రవి, సీపీఐ పట్టణ కార్యదర్శి సిరిసిల్ల**

# 2 కోట్ల రైతుబంధు కొట్టేశారు!

- ఎల్ఐసీ ఫిర్యాదుతో ఏఈవో అక్రమాలు వెలుగులోకి
- సూత్రధారి శ్రీశైలంతోపాటు ఓ ఆటో డ్రైవర్ అరెస్టు
- మరింత లోతుగా విచారిస్తున్న సైబరాబాద్ పోలీసులు



రంగారెడ్డి/హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గు వ్యవసాయ శాఖలో భారీ కుంభకోణం బయటపడింది. అక్కడ వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈవో)గా పనిచేస్తున్న గోరెటి శ్రీశైలం.. రైతులు బతికుండగానే చనిపోయినట్టు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రైతు బీమా, రైతుబంధు పథకాల కింద ఏకంగా రూ.2 కోట్ల సొమ్ము స్వాహా చేశాడు. ఎల్ఐసీ అధికారులకు అనుమానం వచ్చి ఫిర్యాదు చేయడంతో ఆయన అక్రమాల డొంక కదలింది. రూ.కోటి నిధులను పక్కదారి పట్టించినట్టు తేలింది. ఆ తర్వాత వ్యవసాయ అధికారులు అంతర్గతంగా జరిపిన విచారణలో మొత్తం రూ.2 కోట్ల భారీ కుంభకోణం బయటపడింది. దీంతో సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు శ్రీశైలంతోపాటు వీరస్వామి అనే ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

### మూడేండ్లుగా దందా

ఏఈవో శ్రీశైలం దాదాపు మూడేండ్ల నుంచి ఈ అక్రమాలను కొనసాగిస్తున్నట్టు తెలుస్తున్నది. రైతు బంధు పథకానికి దరఖాస్తు చేసుకున్న చాలా మంది రైతులు తమ పట్టాదార్ పాస్ పుస్తకాలు, బ్యాంకు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డుల వివరాలను అధికారులకు సమర్పించపోవడంతో ఆ డబ్బులు పెండింగ్‌లో ఉంటున్నాయి. దీన్ని ఆసరగా చేసుకుని అక్రమాలకు తెరలేపిన శ్రీశైలం.. వివరాలు సమర్పించని రైతులకు సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకాల డేటాను సేకరించాడు. వాటికి తన స్నేహితులు, బంధువులకు సంబంధించిన అకౌంట్లను జత చేసి దాదాపు 2 వేల మంది అన్నదాతలకు చెందాల్సిన రూ.కోటి రైతు బంధు నిధులను పక్కదారి పట్టించాడు.

### రైతు బీమా కింద మరో రూ.కోటి

నకిలీ సర్టిఫికెట్లతో శ్రీశైలం బతికి ఉన్న రైతులను చనిపోయినట్టుగా చూపి రైతు బీమాకు సంబంధించిన మరో కోటి రూపాయలను స్వాహా చేశాడు. 130 వరకు నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలను సృష్టించడంతోపాటు డెత్ సర్టిఫికెట్లలోని వివరాలను మార్ఫింగ్ చేసి 20 మంది రైతులకు సంబంధించిన బీమా సొమ్మును బినామీ ఖాతాల్లోకి మళ్లించాడు. అయితే రెండు, మూడు క్లెయిమ్‌లు ఒకే ఖాతాలో జమ కావడంతో అనుమానం వచ్చిన ఎల్ఐసీ అధికారులు వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అసలు విషయం బట్టబయలైంది. శ్రీశైలం అక్రమాపై అంతర్గత విచారణ జరపడంతో రూ.2 కోట్ల రైతు బంధు నిధులు పక్కదారి పట్టినట్టు తేలింది. దీంతో శ్రీశైలంను సస్పెండ్ చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి సూచించింది.

# ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు

వికారాబాద్, ఫిబ్రవరి 26, (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆలంపల్లిలో రాజీవ్ గృహకల్ప పక్కన దాదాపు రూ.10 కోట్లు విలువైన మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఈ విషయాన్ని 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తీసుకురావడంతో ఆలస్యంగా మేలుకున్న రెవెన్యూ అధికారులు.. ఒకరిద్దరికి నెల క్రితం నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికీ ఆ నోటీసులకు సమాధానం రాకపోయినా ఎలాంటి చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ప్రభుత్వ స్థలాను కాపాడాల్సిన అధికారులే పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ అధికారులే ఈ అక్రమ నిర్మాణాలకు అనుమతులను ఇస్తున్నారని రెవెన్యూ అధికారులు చెప్తున్నారు. దీంతో ఇప్పటికైనా కలెక్టర్ ఈ వ్యవహారంపై దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆలంపల్లి సర్వే నంబర్ 290, 291, 292లో 27 ఎకరాల 25 గుంటల ప్రభుత్వ భూమి ఉన్నది. అందులో 4 ఎకరాలను గతంలో డబుల్ బెడ్ రూం ఇండ్లకు కేటాయించడంతో ఇంకా 23.25 ఎకరాల ప్రభుత్వ భూమి మిగిలింది. దీనిలో దాదాపు మూడున్నర ఎకరాల భూమిని కొందరు ఆక్రమించి అక్రమ నిర్మాణాలకు తెరలేపారు. ఇదే భూమిలో గతంలోనూ అక్రమ నిర్మాణాలు జరిగినట్టు వికారాబాద్ సబ్‌కలెక్టర్ దృష్టికి రావడంతో 56 మందిపై కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చర్యలు తప్పవని అప్పట్లోనే హెచ్చరించారు.

# రైతుబంధు తేదీ మళ్లీ మారింది!

- కొత్త డెడ్‌లైన్ మార్చి 31
- ఎడాపెడా తేదీలు మార్చేస్తున్న సీఎం రేవంత్



హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): రైతుబంధు పంపిణీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దాగుడుమూతలు ఆడుతున్నారనే అసంతృప్తి రైతుల్లో వ్యక్తమవుతున్నది. రైతుబంధు పంపిణీ పూర్తికి ఎడాపెడా తేదీలు మార్చేస్తూ బిచ్చం వేస్తున్న ధోరణిలో వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అధికారంలోకి రాగానే డిసెంబర్ 9 నుంచి రైతుబంధు వేస్తామంటూ ఎన్నికల ప్రచారంలో నమ్మించి, తీరా మార్చి నాటికి కూడా ఇవ్వలేదని ఆవేదన చెందుతున్నారు. ఫిబ్రవరి నెలాఖరుకు కూడా రైతుబంధు పంపిణీ పూర్తికాకపోవడం ప్రభుత్వ ప్రాధాన్యాన్ని ఎండగడుతున్నది. రైతుబంధు పంపిణీ ఎప్పటికీ పూర్తి చేస్తారన్న విషయంలో సీఎం రేవంత్‌రెడ్డికే స్పష్టత ఉన్నట్టు కనిపించడం లేదు. ఎప్పటికప్పుడు తేదీలు మార్చేస్తున్నారు. ఈ నెలలోనే రెండుసార్లు మాట మార్చడం గమనార్హం. ఈ నెల 2న ఎల్బీస్టేడియంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెలాఖరు నాటికి అందరికీ రైతుబంధు పంపిణీ చేస్తామని ప్రకటించారు. గడువు సమీపిస్తున్నా పూర్తికాకపోవడంతో మళ్లీ మాట మార్చారు. ఈ నెల 21న కొడంగల్ పర్యటన సందర్భంగా కోస్గిలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. మార్చి 15 నాటికి అందరి ఖాతాల్లో రైతుబంధు జమ అవుతుందని చెప్పారు. ఇప్పుడు ఆ మాట మీద కూడా నిలబడలేదు. సోమవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 'మార్చి 31 నాటికి రైతుబంధు వేస్తామంటూ కొత్త డేట్ ప్రకటించారు. దీంతో కొత్త తేదీపై కూడా తమకు నమ్మకం లేదని రైతులు వ్యాఖ్యానిస్తుండటం ప్రభుత్వంపై సన్నగిల్లుతున్న విశ్వసనీయతను సూచిస్తున్నది.

# గ్యాస్ బిల్లు మొత్తం కట్టాల్సిందే!

- ఆ తరువాతే బ్యాంక్ ఖాతాల్లో సబ్సిడీ జమ
- 500కే సిలిండర్ పథకం 40 లక్షల మందికే

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం లబ్ధిదారులు తొలుత మొత్తం బిల్లును గ్యాస్ కంపెనీలకు చెల్లించాల్సి ఉంటుందని సివిల్ సప్లై అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ గ్యాస్ సిలిండర్ ధర రూ.955 ఉన్నది కాబట్టి లబ్ధిదారులు తొలు త ఆ మొత్తం చెల్లించాలని వివరిస్తున్నారు. ఆ తరువాత ప్రభుత్వం రూ. 500 పోను మిగతా సొమ్మును గ్యాస్ కంపెనీలకు చెల్లిస్తుందని, అనంతరం గ్యాస్ కంపెనీలు సబ్సిడీ మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తాయని చెప్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం గ్యాస్ సిలిండర్‌పై రూ.40 సబ్సిడీ అందజేస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క సిలిండర్‌కు రూ.415 చొప్పున ఇస్తే సరిపోతుందనే అంచనాలేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ ధరల విషయంలో పట్టణానికీ, పట్టణానికీ మధ్య స్వల్ప వ్యత్యాసాలు ఉంటాయి. రాష్ట్రవ్యాప్తంగా 90 లక్షల తెల్లరేషన్ కార్డులు, 1.24 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ పథకం అమలులో భాగంగా సివిల్ సప్లై అధికారులు తెల్ల రేషన్‌కార్డులు ఉన్న లబ్ధిదారుల లెక్కలు తీయగా అధికారికంగా 65 లక్షల మంది అర్హులుగా తేలినట్టు సమాచారం. కానీ, ప్రస్తుతం 40 లక్షల మందినే అర్హులుగా గుర్తించినట్టు సమాచారం. ఈ 40 లక్షల మందిని ఏ ప్రాతిపదికన గుర్తించారనే విషయంపై స్పష్టతలేదు. అర్హులలో ఎవరెవరున్నారో తెలుసుకోవడం ఎలాగో ప్రభుత్వం కనీసం స్పష్టతనివ్వలేదు.

# తిరుమల ప్రధానార్చకుడు దీక్షితులుపై వేటు



రమణ దీక్షితులు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): తిరుమల ఆలయ గౌరవ ప్రధానార్చకుడు రమణ దీక్షితులుపై టీటీడీ వేటువేసింది. టీటీడీ, ప్రభుత్వం, అహోబిలం మఠం, అర్చకులు, జీయర్లపై రమణ దీక్షితులు చేసిన తీవ్రమైన వ్యాఖ్యలపై కీలక నిర్ణయం తీసుకున్నది. టీటీడీ నుంచి ఆయనను తొలగిస్తూ పాలకమండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు ఆలయ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి వెల్లడించారు. టీటీడీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 9 వేల మంది అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బంది వేతనాలు పెంచుతూ పాలకమండలి నిర్ణయం తీసుకున్నది. శ్రీవారి ఆలయంలోని జయ విజయుల వద్ద ఉన్న తలుపులకు రూ.1.69 కోట్లతో బంగారు తాపడం చేయించాలని నిర్ణయం తీసుకున్నారు. గాలిగోపురం, ఆంజనేయస్వామి విగ్రహం, మోకాల మిట్ట ప్రాంతాల్లో ఇక నుంచి నిత్య సంగీతార్చన నిర్వహించాలని నిర్ణయించారు. తాళ్లపాకలో అన్నమయ్య కళామందిరం నిర్మాణంతోపాటు నిత్య సంగీతార్చన నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. రూ.4 కోట్లతో 4,5,10 గ్రాముల తాళి బొట్టుల తయారీకి పాలకమండలి నాలుగు కంపెనీలకు టెండర్ కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోదముద్ర వేసింది. ప్రతి ఏటా ఫిబ్రవరి 24న టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతి అవిర్భావ దినోత్సవం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.

# నా పేరును రాజకీయంగా వాడుకోవద్దు



**సినీ నటుడు మోహన్‌బాబు వార్నింగ్**

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): తన పేరును కొందరు రాజకీయంగా వాడుకుంటున్నారని ప్రముఖ సినీనటుడు మోహన్‌బాబు అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ లేఖను విడుదల చేశారు. ఈ మధ్య తన పేరును రాజకీయంగా కొందరు ఉపయోగించుకుంటున్నట్టు తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. దయచేసి ఏ పార్టీ వారైనా తన పేరును వారి స్వప్రయోజనాల కోసం వాడుకోవద్దని విజ్ఞప్తి చేశారు. మనం అనేక భావావేశాలున్న వ్యక్తుల ప్రపంచంలో జీవిస్తున్నామని, ఎవరి అభిప్రాయాలు వారివని, అది వ్యక్తిగతమని పేర్కొన్నారు. చేతనైతే నలుగురికి సాయపడడంపైనే దృష్టిపెట్టాలని గానీ సంబంధం లేనివారిని రాజకీయ పార్టీల్లోకి, వారి అనుబంధ సంస్థల్లోకి తీసుకురావడం బాధాకరమని తెలిపారు. ఈ విషయాలను ఉల్లంఘించిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని లేఖలో హెచ్చరించిన ఆయన ఎవరిని ఉద్దేశించి ఈ పోస్ట్ చేశారన్నది మాత్రం చెప్పలేదు.